తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026

# ధర్మరాజుల తిరునాళ్లు ప్రారంభం

శ్రీకాళహస్తి, జూలై 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ధర్మరాజుల తిరునాళ్ళు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. ఆలయంలోని ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్, శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ ఆవరణలో శాస్త్రోక్తంగా హోమాలు ఏర్పాటు చేసారు. కలశ స్థాపనను ఆలయ అర్చకులు డాక్టర్ స్వామీనాధన్ గురుకుల్



ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

సారధ్యంలో నిర్వహించారు. భక్తులు సమర్పించిన చీరలను అధిరోహింప జేసారు. పాండవ జననం, కౌరవ జననం కథతో అంకురార్పణ ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ఇఓ కెవి సాగర్‌బాబు పర్యవేక్షణలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. పట్టణానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 12రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి రోజూ ఉదయం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించబడుతుందని ఇఓ వివరించారు. ధ్వజారోహణం తరువాత పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమాల్లో ఇఓ బికె వెంకటేశు, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్‌గురుకుల్, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, శానిటరీ ఇన్స్పెక్టర్ కృష్ణారెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి ఎఇఓ హేమామాలిని, లక్ష్మయ్య, సభ్యులు తదితరులు హాజరయ్యారు.

# రామకుప్పంలో... వృద్ధ దంపతుల దారుణహత్య

**- విచక్షణా రహితంగా కత్తులతో దాడి.. ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా ఘటన**



దారుణహత్యకు గురైన వెంకటేష్, పార్వతమ్మల మృతదేహాలు

రామకుప్పం, జూలై 17 ప్రభాతవార్త: ద్విచక్రవాహనంలో తమ ఇంటికి వెళ్తున్న వృద్ధ దంపతులను గుర్తు తెలియని వ్యక్తులు దారుణ ంగా హతమార్చిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. దు ండగులు కత్తులతో భార్యభర్తపై విచక్షణారహితంగా దాడులు చేయడంతో సంఘటనా స్థలిలోనే వారు ప్రాణాలు కోల్పోయారు. రామకుప్పం మండలంలో సంచలనం కలిగించిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా.. మండలంలోని బందార్లపల్లికి చెందిన వెంకటేష్ (67) అతని భార్య పార్వతమ్మ (65)రామకుప్పంకు వచ్చి ఇంటికి ద్విచక్రవాహనంలో తిరుగుప్రయాణం అయ్యారు. మార్గమధ్యంలో బందార్లపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు హఠాత్తుగా వెంకటేష్, పార్వతమ్మలపై కత్తులతో దాడిచేసి నరికారు. తల, మెడభాగాలపై విచక్షణారహితంగా దాడి చేయడంతో వారు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే కుప్పకూలారు. విషయం తెలుసుకున్న డిఎస్పీ పార్థసారథి, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై వెంకటమోహన్ హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధదంపతుల దారుణహత్యకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

### ఇస్రో, స్వదేశీ ప్రైవేట్ భాగస్వామ్యతో...

# విక్రమ్ వన్ రాకెట్ నింగిలోకి

**-నేడు నింగిలోకి విక్రమ్ 1రాకెట్ -ఉదయం 6 గంటల నుంచి కౌంట్ డౌన్**

సూళ్లూరుపేట, జూలై 17 ప్రభాతవార్త :హైదరాబాదుకు చెందిన స్పేస్ టెక్ స్టార్ట్ అప్ సమస్థ రూపొందించిన విక్రమ్ 1 అనే ఈ రాకెట్ భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ జ్ఞాపకార్థం విక్రమ్ అని పేరు పెట్టారు. ఇస్రో,స్వదేశీ ప్రైవేట్ కీలక భాగస్వామ్యతో రూపొందించిన విక్రమ్ వన్ రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. శనివారం ఉదయం 6 గంటలకు కౌంట్ డౌన్ మొదలుపెట్టి 11 గంటల 30 నిమిషాలకు రాకెట్ను నింగిలోకి ప్రవేశపెట్ట నున్నారు. చిన్నపాటి రాకెట్ కావడంతో కేవలం ఐదున్నర గంటల కౌంట్ డౌన్‌తో ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నారు. ఈ చారిత్రత్మకమైన ప్రయోగానికి ప్రయోగానికి మిషన్ ఆగమన్‌అనే పేరు పెట్టారు. విక్రమ్ రాకెట్ 24 మీటర్ల ఎత్తు గల మల్టీ స్టేజ్‌లు కలిగి ఉన్న రాకెట్. రాకెట్ బరువును తగ్గించి,ఎక్కువ బరువును మోసుకెళ్లే విధంగా ఆల్ కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో ఈ రాకెట్ ను తయారు చేశారు. ఈ రాకెట్ ప్రయోగంలో నాలుగు దశలు ఉంటాయి మూడు దశల్లో ఘన ఇంధనం నాలుగో దశలో కక్ష్యను కచ్చితంగా సర్దుబాటు చేయడం కోసం హైపర్ గోలిక్ ద్రవ ఇంధనాన్ని ఉపయోగిస్తారు. ఈ రాకెట్‌లో త్రీడి ప్రింటెడ్ ఇంజన్లు ఉపయోగిం చడంతో నిర్మాణ ఖర్చు తగ్గడమే కాకుండా వేగంగా అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసేందుకు వీలవుతుంది. ఇది 350 కేజీల బరువు గల చిన్న ఉపగ్రహన్ని భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో గల లియో ఆర్బిట్‌లోకి లేదా 250 కిలోమీటర్ల దూరంలోని సూర్య సమకాలిన కక్షలోనికి ప్రవేశ పెట్టేందుకువీలుగా ఈ రాకెట్ను రూపకల్పన చేశారు.

**ఈ రాకెట్ వల్ల ఉపయోగాలు:**

ఈ రాకెట్ తో గ్లోబల్ మార్కెట్లో కమ్యూనికేషన్ వ్యవస్థ, వాతావరణ పరిశోధన సేవలు, ఇంటర్నెట్ సేవలు కోసం వాడే చిన్న తరహా ఉపగ్రహాలను అతి తక్కువ ఖర్చుతో అంతరిక్షంలోకి పంపేందుకు ఈ రాకెట్ ఉపయోగపడుతుంది. ఈ రాకెట్ ద్వారా ఒకే ప్రయోగంలో బహుళ ఉపగ్రహాలు వేర్వేరు కక్షలోకి




విక్రమ్ వన్ రాకెట్ ప్రయోగానికి సిద్ధం

ప్రవేశపెట్టే సామర్థంతో ఈ రాకెట్ పనిచేస్తుంది. కాస్మో సర్ఫ్ స్పేస్ అనే స్టార్ట్ అప్ అంతరిక్ష సమస్త యాక్టివ్ డిబ్రిస్ రిమూ వాల్ అభివృద్ధి చేసిన మిషన్ ఎంబ్రేస్‌ను విక్రమ్ వన్ ద్వారా ప్రయోగించనున్నారు. మిషన్ ఆగమన్ పేరుతో జరుగుతున్న ఈ ప్రయోగం కక్షలో రోబోటెక్ క్యాప్చర్ అనే సాంకేతికతను ప్రదర్శించే ప్రథమ పేలోడ్ కక్షలో పేరుకుపోయిన పని చేయని ఉపగ్రహాలు, అంతరిక్షంలోని శిథిలాలను తొలగించడం లక్ష్యంగా ఈ పే లోడ్‌ను తయారు చేశారు.

**రాకెట్‌లో ఇతర పేలోడ్లు:**

స్కై రూట్ సంస్థ రూపొందించిన స్కోప్ ఉపగ్రహం,గృహ స్పేస్, కాస్మో సర్ఫ్,జర్మనీకి చెందిన డే క్యూ బ్డ్‌ఉపగ్రహాలు ఉన్నాయి. అత్యంత సరళమైన డిజైన్‌తో రాకెట్‌ను రూపకల్పన చేయడంతో 24 గంటల్లో ఈ రాకెట్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేసి ప్రయోగానికి సిద్ధం చేయవచ్చు. ఈ రాకెట్ ద్వారా భారత దేశంలో శాస్త్రవేత్తలుగా సేవలందించి చిరస్మరణీయులుగా మిగిలిన సర్ సివి రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మ ప్రతిమలను నింగిలోకి పంపనున్నారు. వరంగల్‌కు చెందిన అజయ్ కుమార్ మైక్రో ఆర్ట్ ద్వారా 18 క్యారెట్ల బంగారంతో తయారు చేసిన ఈ ప్రతిమలను బియ్యం గింజ కన్నా తక్కువ పరిమాణంలో 800 మైక్రాన్ల ఉండే విధంగా వీటిని తయారు చేశారు. ఈ రాకెట్ ప్రయోగం విజయవంతం అయితే ఇస్రో పై భారం తగ్గుతుంది. చిన్న ప్రయోగాలకు ఈ రాకెట్‌ను ఉపయోగించి భారీ ప్రయోగాలైన గగనయాన్, చంద్రయాన్ వంటి కష్టమైన ప్రయోగాల పైఇస్రో పూర్తిస్థాయిలో దృష్టి సారించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. విక్రమ్ 1 రాకెట్ ప్రయోగం విజయ వంతం అయితే చిన్న ఉపగ్రహాలను నింగిలోకి తీసుకెళ్లి నిర్దేశించిన కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రథమ స్వదేశీ కమర్షియల్ రాకెట్ అవుతుంది.

### ఈ నెల 22న తిరుపతిలో...

# ప్రపంచ మామిడి దినోత్సవం

**- ఏపీ రైతు సంఘం పిలుపు - గంధమనేని శివయ్య భవన్లో మామిడి బోర్డు, గిట్టుబాటు ధరపై చర్చ - పాకాలలో మామిడి దినోత్సవ కరపత్రాల ఆవిష్కరణ**

పాకాల, జూలై 17 ప్రభాతవార్త: జూలై 22న తిరుపతిలో జరగనున్న ప్రపంచ మామిడి దినోత్సవ సదస్సుకు మామిడి రైతులు, రైతు నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం నేతలు డాక్టర్ టి. జనార్ధన్, జి. మునిరత్నం పిలుపునిచ్చారు. శుక్రవారం పాకాల భారతంమిట్ట వద్ద మామిడి దినోత్సవ కరపత్రాలను రైతు సంఘం నాయకులు బెల్లంకొండ శ్రీనివాసులు, వెంకటరత్నం, శివారెడ్డిలతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మామిడి రైతులను ఆదుకునే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తుత్తి ప్రకటనలు, హామీలకే పరిమితమయ్యాయని విమర్శించారు. వాస్తవంగా గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా విలవిలలాడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కిలో మామిడికి రూ.17.47 పైసలు ప్రకటించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో రైతులకు రాంపుల వద్ద కేవలం మూడు రూపాయలు, ఫ్యాక్టరీల వద్ద ఐదు రూపాయలు మాత్రమే దక్కిందని వారు పేర్కొన్నారు. దీనివల్ల రైతులకు కనీసం రవాణా ఖర్చులు, కోత కూలీలు కూడా గిట్టుబాటు కాలేదని వాపోయారు. గత ఏడాది తరహాలోనే ఈ సంవత్సరం కూడా మామిడి రైతులకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతున్నా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోందని మండిపడ్డారు.

**ఐకార్ కమిటీ నివేదికపై స్పష్టత ఇవ్వాలి:**




కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

సీజన్ ముగిసే సమయంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన ఐకార్ కమిటీ, రైతులకు లబ్ధి చేకూర్చేలా నివేదిక ఇస్తేనే ఫలితం ఉంటుందని, లేనిపక్షంలో అది కేవలం కంటితుడుపు చర్యగానే మిగిలిపోతుందని నాయకులు స్పష్టం చేశారు. తక్షణమే మామిడి బోర్డును ఏర్పాటు చేసి, అందులో రైతుల భాగస్వామ్యంతోనే మామిడి ధరలను నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు.

**- 22న తిరుపతిలో భారీ సదస్సు:**

జూలై 22న తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్లో జరిగే ప్రపంచ మామిడి దినోత్సవ సదస్సులో పలువురు రైతు నాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు కీలక సూచనలు చేయడంతో పాటు భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సభకు రైతులు వందలాదిగా తరలివచ్చి గిట్టుబాటు ధర సాధన కోసం సమాయత్తం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాకాల, కొత్తకోట రైతు నాయకులు చెంగల్ రెడ్డి, ప్రకాష్, శంకర్, నాగరాజు, రాజేంద్ర, షబ్బీర్, మధు, లోకనాథ్ సింగ్, హేమానంద తదితరులు పాల్గొన్నారు.

### శాంతిభద్రతల పరిరక్షణ

# నేరాల నియంత్రణలో డ్రోన్‌లు కీలకం




తిరుపతి, జులై 17ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో శాంతిభద్రతలు భారీ బందోబస్తు, నేరాల నియంత్రణ విపత్తు సహాయక చర్యల్లో డ్రోన్ సాంకేతికత వినియోగం మరింత దోహదపడుతుందని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి పోలీసులు ఆధునిక సాంకేతికతలో మరో ముందడుగు వేశారన్నారు. 12 రోజుల సమగ్ర శిక్షణ పూర్తి చేసి థియరీ, ప్రాక్టికల్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన పోలీసు సిబ్బందికి అధికారిక డీజీసీఏ రిమోట్ పైలట్ లైసెన్సుల ప్రదానం జరిగింది. తిరుపతి జిల్లా పోలీసు శాఖ ఇటీవల అత్యాధునిక సాంకేతికత కలిగిన 10 డ్రోన్లను వినియోగంలోకి తీసుకువచ్చి, వాటిని రోజువారీ పోలీసింగ్‌లో సమర్థవంతంగా ఉపయోగించడానికి ఈ కార్యక్రమానికి నాంది పలికారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా, ప్రత్యేక బందోబస్తు విధులు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అనేక కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. థియరీ ప్రాక్టికల్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 20 మంది పోలీసు సిబ్బందికి డీజీసీఏ ఆమోదిత డ్రోన్ పైలట్ లైసెన్సులు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అత్యంత కీలకమైందని, ముఖ్యంగా డ్రోన్ టెక్నాలజీ పోలీసుశాఖ పనితీరును మరింత సమర్థవంతంగా మారుస్తోందని తెలిపారు.

# ఆరేళ్ల నిరీక్షణకు ముగింపు

**-పలమనేరు టిడ్కో లబ్ధిదారులకు ఊరట-లబ్ధిదారులకు రూ.28 లక్షల చెక్కులు పంపిణీ**



పలమనేరు రూరల్, జూలై 17 ప్రభాతవార్త : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం టిడ్కో గృహాల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులను పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథరెడ్డి పంపిణీ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా తమ డబ్బు తిరిగి వస్తుందో లేదో అనే ఆందోళనలో ఉన్న లబ్ధిదారులకు ఈ కార్యక్రమం ద్వారా ఊరట లభించింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో టిడ్కో గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో లబ్ధిదారుల వాటాగా రూ.25 వేల నుంచి లక్ష రూపాయల వరకు డీడీల రూపంలో సొమ్ము చెల్లించారు. పలమనేరు మున్సిపల్ పరిధిలో మొత్తం 278 మంది లబ్ధిదారులు తమ ఆర్థిక స్థోమత మేరకు చెల్లింపులు చేశారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత టిడ్కో పనులు నిలిచిపోవడంతో, ఆరేళ్లుగా లబ్ధిదారులకు న్యాయం జరగలేదు. వారు చెల్లించిన సొమ్ము కూడా తిరిగి అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి సుమారు రూ.28లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళా అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో చాలా వరకు అమలు చేశామని, గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం కారణంగా రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మెగా చెక్కును ఆవిష్కరించి, లబ్ధిదారులకు వ్యక్తిగత చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్ వర్మ, మెప్మా సీఎంఎం బాబా, టీపీఎస్ ఇందిర, ఏఈ స్నేహప్రియా, బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు అర్వి బాలాజీ, నాయకులు కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, చాంద్ బాషా, మదన్, కిరణ్, పర్వీన్, లోకేష్, శ్రీనివాసులు, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు

**- ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రించడానికి సమన్వయంతో విధులు- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్**

చిత్తూరు, జులై 17 ప్రభాతవార్త: జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంను పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యర్థాల నిర్వహణను మరింత పక్కాగా అమలు చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంను కట్టుదిట్టంగా అమలు చేయడంపై ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ అమలుపై జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే పలు నిబంధనలు, మార్గదర్శకాలను జారీచేసిందని, ప్రస్తుతం ఈ మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయడంపై దృష్టి కేంద్రీ కరించాలన్నారు. దీనికోసం అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంచి క్షేత్ర స్థాయిలో ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో ఇంటింటి నుండి సేకరిస్తున్న వ్యర్థాలను తప్పనిసరిగా తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలుగా వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్ధాల సేకరణ, వర్గీకరణ అనంతరం వాటి సక్రమ పారవేతకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమలులో వున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతున్నట్లు సమావేశంలో చర్చించారు.

### ప్రజారోగ్యానికి...

# భంగం కలగకుండా వ్యాపారాలు

**-మటన్, చేపల మార్కెట్ మార్పునకు ఏకగ్రీవ నిర్ణయం**
**-జిల్లా కలెక్టర్,నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్**

తిరుపతి కలెక్టరేట్, జూలై 17 ప్రభాతవార్త: ప్రజారోగ్యానికి భంగం కలగించే వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న మటన్, చేపల మార్కెట్లను మరొక చోట మార్చేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం మినీ మీటింగ్ హాల్ నందు నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, డిప్యూటీ కమిషనర్ ఎన్. అమరయ్య, అడిషనల్ ఎస్పి రవి మనోహరాచారి, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ డా. యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, జిల్లా ఫుడ్ కంట్రోలర్ వేంకటేశ్వర రావు, ఏసీపీ పార్వతి ప్రియ, ఫిషరీస్ అధికారులు, తిరుపతి అర్బన్, రూరల్ తహశీల్దార్లు, తుడా విభాగాధిపతులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలోని లీలా మహల్ వద్ద నగర నడిబొడ్డులో వున్న చేపల మార్కెట్ వలన ట్రాఫిక్‌కు, చుట్టుపక్కల నివాస ప్రాంతాల వారికి ఇబ్బంది కారంగా ఉందని ప్రజల నుండి ఎక్కువగా పిర్యాధులు వస్తున్నాయని తెలిపారు. అలాగే పెద్దపీర్ల చావిడిలోని మటన్ మార్కెట్ నిర్వహణ వలన పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్న ప్రజలకు అనేకరకాల వ్యాధులు, దుర్వాసన, న్యూసెన్స్ కలుగుతున్నదని, ఆంత్రాక్స్ వంటి వ్యాధులు రావడానికి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

ఆస్కారమున్నదని పిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. కావున ప్రజలకు, వారి ఆరోగ్యానికి ఇబ్బందికరంగా ఉన్న మటన్ మార్కెట్ ను పెద్దపీర్ల చావిడి నుండి వైకుంఠపురం రోడ్డు పార్క్ వద్ద వున్న నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ లోనికి, లీలమహల్ వద్ద వున్న చేపల మార్కెట్ ను లీళి పల్లె, న్యూ బాలాజీ కాలనీ లోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లోనికి వెంటనే మార్చవలసినదిగా నిర్ణయించారు. అందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు వెంటనే చేయవలసినదిగా సంబంధిత విభాగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే భక్తులకు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా ఉండడంతో జూపార్క్ రోడ్డులో తొలగించిన వీధి వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలిపిరి వద్ద జూపార్కు రోడ్డులో తొలగించబడిన షాపులను ఇస్కాన్ రోడ్డు నుండి చెన్నారెడ్డీ కాలనీలోకి వెళ్లే అభయ చరణారవింద భక్తి వేదాంత స్వామి ప్రభుపదుల మార్గం రోడ్డులోను, చింతలచేను వద్దగల కులశేఖర్ ఆల్వార్ వంద అడుగుల రోడ్డులలో వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత వ్యాపారస్తులు ప్రజారోగ్యానికి భంగం కలుగకుండా తీసుకున్న చర్యలకు సహకరించి, వారి వ్యాపారాలు అధికారులు సూచించిన ప్రదేశాలలో పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని వ్యాపారస్థులకు తెలిపారు.

# భక్తులకు నిస్వార్ధంగా సేవలు

**- ఆలయ ఇఓ పెంచల కిషోర్**



సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఇఓ

కాణిపాకం, జులై 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలుగుతూ నిస్వార్థంగా సేవలు అందించాలని దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి కె.పెంచల కిషోర్ ఆయల అధికారులు, సిబ్బందికి సూచించారు. కాణిపాకం దేవస్థానంలో పని చేసే వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఇఓ కార్యాలయ సమావేశభవనంలో సమావేశం నిర్వహిం చారు. ఇఓ పెంచల కిషోర్ మాట్లాడుతూ ఆలయ దర్శనార్థం సుదూర ప్రాంతాల నుండి భక్తులు స్వామి వారి పట్ల భక్తిశ్రద్ధలతో ఆలయానికి వస్తుంటారన్నారు. ఈ నేపథ్యంలో సిబ్బంది భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. అలాగే క్యూ లైన్లు నడిపే సిబ్బంది ప్రతి ఒక్క భక్తుడిని గణేష అని సంబోధించాలని సూచించారు. ముఖ్యంగా దేవస్థానంలో శానిటేషన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత ఎఇఓ, సూపరిటెండెంట్లకు సూచించారు. అలాగే అన్నదానంలో విధుల నిర్వహించే సిబ్బంది భక్తులకు ఓపికతో అన్నప్రసాద వితరణ చేయాలని తెలిపారు. దీంతో పాటు లడ్డు పోటు నందు విధులు నిర్వర్తించే సిబ్బంది భక్తులకు నాణ్యమైన లడ్డు ప్రసాదాలను అందించాలని తెలిపారు. అలాగే దేవస్థానంలోని పలు విభాగాలకు చెందిన సిబ్బంది, అర్చకులు, వేద పండితులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ సాగర్‌బాబు, ఎఇఓలు ఎస్‌వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, మాధవరెడ్డి, ప్రసాద్, సూపరిటెండెంట్లు కోదండపాణి, వాసులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# పుష్ప పల్లకీపై పురుషోత్తముడు

**-ఆణివార ఆస్థానాన ఆనందభరితుడైన మలయప్ప**

తిరుమల, జులై 17ప్రభాతవార్తప్రతినిధి: ఆణివార ఆస్థానం పర్వదినాన శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్ప పల్లకీపై తిరుమల పురవీధుల గుండా విహరించారు. టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో పల్లకీ ముందువైపు మహావిష్ణువు, ఇరువైపులా, జయ విజయులు, మధ్యలో ద్వారక కృష్ణుడు, వెనుకవైపు ఆంజనేయస్వామి సెట్టింగు లను ఏర్పాటు చేశారు. అలాగే రోజాలు, చామంతి, లిల్లి, మొలలు, మల్లి, కనకాంబరం, తామ రపూలు, వృక్షి తదితర 9 రకాల సాంప్రదాయ పుష్పలు, ఐదు రకాల కట్ ఫ్లవర్స్‌ను వినియోగించారు. వివిధ సాంప్రదాయ పుష్పలు, కట్ ఫ్లవర్స్‌తో విశేష అలంకరణలు చేశారు. సాయంత్రం స్వామివారు అధిరోహించిన పుష్పపల్లకీ మరింత శోభాయమానంగా సాగింది. భక్తుల గోవిందనామస్మరణలతో విజయవంతంగా జరిగింది. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం దంపతులు, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



18 CTR 2:18 CTR 2.qxd 7/17/2026 11:43 PM Page 1



# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

– కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు



**చిత్తూరు, జులై 17 ప్రభాతవార్త:** ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వం యొక్క లక్ష్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పేర్కొన్నారు. చిత్తూరు నగర పాలకసంస్థ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లోని సిబిఎన్ కాలనీలో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక అవసరాలకు అనుగుణంగా మౌళిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల విస్తరణ, తాగునీటి సౌకర్యాలు, పార్కుల అభివృద్ధి వంటి పనులను ప్రజల సహకారంతో వేగవంతంగా చేపడుతున్నామన్నారు. చిత్తూరు నగర అభివృద్ధికి రహదారుల విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులు ఎంతో అవసరమని, ప్రజాప్రతి నిధుల సహకారం, ప్రజల మద్దతుతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేస్తున్నామన్నారు. రానున్న ఏడాదిన్నర కాలం నగరాభివృద్ధికి అత్యంత కీలకమని, అందరు సమన్వయంతో పని చేస్తే నగర పరిధిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయవచ్చునని కలెక్టర్ స్పష్టం చేశారు. చిత్తూరు నగర పరిధిలో ప్రస్తుతం ఏడు అర్బన్ హెల్త్ సెంటర్లు పని చేస్తున్నాయని, ప్రజలు చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం లేదని, స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ప్రశాంత్‌నగర్ యుపిహెచ్‌సి పరిధిలో సుమారు 20 వేల మంది ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యంను వారి నివాస ప్రాంతానికే తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆధునిక వసతులతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. సాంబయ్యకండ్రిగ-కట్టమంచి రోడ్డు, దర్గా జంక్షన్-ఇరువారం వరకు రోడ్డు విస్తరణ పనులను వేగంగా చేపట్టి పూర్తి చేస్తున్నామన్నారు. అలాగే కట్టమంచి నుండి ఎంఎస్‌ఆర్ వరకు నాలుగు వరుసల రోడ్డు అభివృద్ధి కోసం రూ.37 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఇప్పటికీ ప్రజలు, స్థానిక నాయకుల సహకారంతో చిత్తూరు నగరంను అంచెలంచలుగా అభివృద్ధి చేస్తున్నామని, రోడ్ల విస్తరణకు సంబంధించి ఎన్ని అటంకాలు ఎదురైనా ముందుకు వెళ్ళి రోడ్డలను విస్తరించజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తాను ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా చిత్తూరు నగరంను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, డాక్టర్ అనిల్, డాక్టర్ నవీన్, మున్సిపల్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు...

ప్రారంభమైన ఉద్యోగుల విభజన ప్రక్రియ

– ముసాయిదా జాబితాలు సిద్ధం చేయాలని డిఆర్ఓ మోహన్‌కుమార్ ఆదేశం

చిత్తూరు, జులై 17 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి విభజించబడి కొత్తగా ఏర్పాటైన తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు ఉద్యోగుల విభజన ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో ప్రతిశాఖలో పని చేసే ఉద్యోగుల సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకుని ముసాయిదా జాబితాలు సిదం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో శుక్రవారం డిఆర్ఓ మోహన్‌కుమార్ ప్రభుత్వ ఉద్యోగుల విభజనలో పారదర్శకత అమలుపై జిల్లాలోని వివిధ శాఖల ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ పాత జిల్లా కేడర్ నుండి కొత్తగా ఏర్పడిన జిల్లా, అనుబంధ జిల్లా, జోనల్, మల్టీ జోనల్, అనుబంధ జోనలకు ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియను దశల వారీగా చేపట్టనున్నారు. ప్రతి శాఖకు సంబంధించి పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య, తుది కేడర్ బలాన్ని సమగ్రంగా పరిశీలించి, వివరాలను ఖరారు చేయాలన్నారు. అర్హులైన ఉద్యోగులందరికీ సీనియార్టీ జాబితాలో చోటు కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే విభజన సమయంలో ఏ ఉద్యోగీ మిగిలిపోకుండా చూడాలన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ప్రతి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నుండి వాచ్‌మెన్ వరకు 85 మంది పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, ప్రతి కలెక్టరేట్‌లో డిఆర్ఓ, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్, భూసంస్కరణల పాలనాధికారి, నలుగురు తహసీల్దార్లు వున్నారని చెప్పారు. అలాగే 16 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 16 మంది సీనియర్ అసిస్టెంట్లు, 10 మంది జూనియర్ అసిస్టెంట్లు, 10 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 16 మంది ఆఫీస్ సబార్డినేట్లు, నలుగురు డ్రైవర్లు, ఇద్దరు వాచ్‌మెన్లు, రికార్డు అసిస్టెంట్లు, జమేదార్లు వుండాల్సివుందన్నారు. ఇప్పటి వరకు కలెక్టరేట్ ఆవరణలో మండలాల నుండి డిప్యూటీ తహసీల్దార్లను డిప్యూటేషన్లను తీసుకురావడం జరుగుతున్నదన్నారు. ఇక 16 మంది డిప్యూటీ తహసీల్దార్లను ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందన్నారు. అలాగే తహసీల్దారు పోస్టులను మల్టీ జోన్‌జోన్ 1,2 కలిపి(గా పరిగణిస్తున్నారన్నారు. ఆయా శాఖల కార్యాలయాల్లో ఈ మేరకు వివరాలను ప్రదర్శించి ముసాయిదా జాబితాపై ఈ నెల 20వ తేదీలోపు అభ్యంతరాలను ఉద్యోగుల నుండి స్వీకరించాలన్నారు. ఆపై 22వ తేదీన తుది సీనియార్టీ జాబితాను విడుదల చేయాలని, 26వ తేదీ వరకు ఉద్యోగుల నుండి అప్షన్ ఫారాలు స్వీకరించాలని, ఇందులో ప్రతి ఉద్యోగికి మూడు అప్షన్లు ఇస్తారన్నారు. ఎవరు పోటీ లేకుంటే ఉద్యోగి కోరుకున్న చోటుకు బదిలీ చేయడం జరుగుతుందని, అదే ప్రదేశానికి ఇతర ఉద్యోగులు పోటీ పడితే సీనియార్టీ జాబితాను పరిగణనలోకి తీసుకుని కేటాయించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు ఉద్యోగులకు అవకాశం కల్పించడం జరుగుతుందని, ఆపై ఉద్యోగులకు చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు కేటాయింపులు చేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ స్పష్టం చేశారు.

## పిఎన్‌జి గ్యాస్ కనెక్షన్ల విస్తరణకు సమన్వయంతో చర్యలు

– జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



**చిత్తూరు, జులై 17 ప్రభాతవార్త:** జిల్లాలో గృహ, వాణిజ్య వినియోగదారులకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) కనెక్షన్ల విస్తరణకు సంబంధిత శాఖలు సమన్వయంతో విధులు నిర్వర్తించి క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం జెసి ఆదర్శ్ రాజేంద్రన్ పైప్డ్ నేచురల్ గ్యాస్(పిఎన్‌జి) కనెక్షన్ల అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ప్రజలు, వాణిజ్య సంస్థలు పిఎన్‌జి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంపొందించాలని, జిల్లాలో పిఎన్‌జి కనెక్షన్లు పొందడానికి ఆసక్తి వున్న గృహాలు, వాణిజ్యసంస్థలు, ఇతర వినియోగదారులను గుర్తించడానికి మున్సిపల్ కమిషనర్లు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశ గడువులోపు పనులు పూర్తి చేసే వార్డు, వీధి, పేరు, సంప్రదింపు వివరాలు, వినియోగదారుల విభాగం తదితర సమాచారంతో సమగ్ర నివేదిక రూపొందించి పిఎన్‌జి సంస్థకు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో హాజరైన వాణిజ్య సంస్థల ప్రతినిధులు పిఎన్‌జి వినియోగానికి సంబంధించిన పలు సూచనలు చేశారు. గ్యాస్ వినియోగించిన మేరకు బిల్లు చెల్లించే విధానం అమలులో వుందని, వినియోగదారులకు ఈ విషయంపై మరింత అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత పిఎన్‌జి సంస్థ ప్రతినిధులకు ఆదేశించారు. అలాగే పిఎన్‌జి కనెక్షన్ ఏర్పాటు కోసం చెల్లించాల్సిన ప్రారంభ రుసుమును విడతల వారీగా చెల్లించే అవకాశాలను పరిశీలించాలని వాణిజ్య సంస్థల ప్రతినిధులు కోరగా, దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత పిఎన్‌జి సంస్థను జెసి ఆదేశించారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు, సంస్థ ప్రతినిధులు తమకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశ గడువులోపు పూర్తి చేసి తదుపరి సమీక్ష సమావేశానికి కార్యాచరణ సిద్ధం చేసుకుని హాజరు కావాలని జెసి సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జీ డిఎస్‌ఓ శ్రీలక్ష్మీ, మెప్మా పిడి పి.శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, చిత్తూరు అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ శుభప్రద, పిఎన్‌జి సంస్థ ప్రతినిధులు, వాణిజ్య సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై వైకాపా తప్పుడు విమర్శలు

**పెనుమూరు, జులై 17 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్ష వైకాపా నాయకులు తప్పుడు విమర్శలు చేస్తూ అభివృద్ధికి అటంకం కల్పిస్తున్నారని రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి పెద్దినేని కృష్ణమూర్తినాయుడు ఓ ప్రకటనలో విమర్శించారు. వైకాపా అధినేత వైఎస్ జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్ళినా వైకాపా నాయకులు, ఆ పార్టీ కార్యకర్తలు నానా హంగామా, అత్యుత్సాహం చూపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలోనే సిఎం నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేశామన్నారు. త్వరలో చేనేత కార్మికులకు రూ.15 వేలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందన్నారు. వైకాపా నాయకులు చెప్తున్న మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, ఈ విషయం త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రుజువు అవుతుందన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తం

– డిజిటల్ భద్రతపై విద్యార్థులకు అవగాహన

– జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి




చిత్తూరుహెల్త్, జులై 17 ప్రభాతవార్త: డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా వుండాలని, అలాగే సోషల్ మీడియా, ఆన్‌లైన్ లావాదేవిలను విద్యార్థులు బాధ్యతా యుతంగా వినియోగించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి అన్నారు. చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ అదే స్థాయిలో సైబర్ నేరాలు సైతం పెరుగుతున్నాయన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ చెల్లింపులు ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో వ్యక్తిగత సమాచారం ఎవరికి పంచుకోరాదన్నారు. అలాగే అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే లింకులు, సందేశాలు, కాల్స్‌ను నమ్మి వ్యక్తిగత వివరాలు, ఓటిపిలు, బ్యాంకు వివరాలు వెల్లడించరాదన్నారు. ఎదైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్‌రావు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తే మోసాలను గణనీయంగా తగ్గించడానికి అవకాశం వుంటుందన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, ఫేక్ అకౌంట్లు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో వచ్చే మోసాలు, లాటరీలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల ఆఫర్లు వంటి వాటిపట్ల యువత అప్రమత్తంగా వుండాలని సూచించారు. అలాగే వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, పాస్‌వర్డులను ఇతరులతో పంచుకోవద్దని, బలమైన పాస్‌వర్డులు ఉపయోగించడంతో పాటు రెండు దశల భద్రత తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు, పోలీసు అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఎఐ పోటీల్లో సత్తా చాటిన అపోలో విద్యార్థి

– గూగుల్ క్లౌడ్ హ్యాకథాన్‌లో తొలి బహుమతి, రూ.4.30 లక్షల ప్రోత్సాహకం

**చిత్తూరు, జులై 17 ప్రభాతవార్త:** అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన గూగుల్ క్లౌడ్ ర్యాపిడ్ ఏజెంట్ హ్యాకథాన్(ఎలాస్టిక్ ట్రాక్)పోటీలో 'ది అపోలో యూనివర్సిటీ' విద్యార్థి వినయ్ తొలి బహుమతి సాధించారు. వినయ్ రూపొందించిన క్రైసిస్ రూట్ ఏఐ ప్రాజెక్టుకు 5 వేల అమెరికన్ డాలర్లు(సుమారు రూ.4.30 లక్షలు) నగదు బహుమతి లభించింది. అత్యవసర పరిస్థితుల్లో వున్న రోగులకు తక్కువ సమయంలో తగిన ఆసుపత్రికి చేరవేసేలా కృత్రిమ మేధ(ఏఐ) ఆధారంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు బయోమెడికలల్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. చికిత్స ఆలస్యం తగ్గించి, అత్యవసర వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే దీని ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం.నాగార్కర్ విద్యార్థి వినయ్‌ను అభినందించారు. విద్యార్థుల్లో పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పించడంలో ది అపోలో యూనివర్సిటీ ఎల్లప్పుడు ముందుంటుందని చెప్పారు. ఇలాంటి విజయాలు విశ్వవిద్యాలయ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచుతుందన్నారు.

## లింక్ రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం



**కుప్పం, జూలై 17 ప్రభాతవార్త :** స్థానిక కొత్తపేటలో కుప్పం - కృష్ణగిరి జాతీయ రహదారి నుంచి శ్రీ పెద్దపల్లి గంగమ్మ దేవస్థానం వరకు చేపట్టనున్న లింక్ రోడ్డు విస్తరణ పనులకు శుక్ర వారం నాయకులు శ్రీకారం చుట్టారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీ నియంత్రిం చడంతో పాటు ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, టిఎన్‌ఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు మునెప్ప తదితరులు ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కుప్పం పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రోడ్డు వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్థానిక ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సమావేశంలో స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 3లక్షలతో పిహెచ్‌సి కేంద్రం సుందరీకరణ

**శాంతిపురం, జూలై 17 ప్రభాతవార్త :** మండలంలోని రాళ్లబూదుగూరు పిహెచ్‌సిని సుందరీకరించాలని కడ పి.డి. వికాస్ మర్మత్ ఆదేశించడం తో 3లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన పిహెచ్‌సిని సందర్శించారు. స్థానికంగా ఉన్న కంపెనీల సిఎస్ఆర్‌తో నేతల సహకారంతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే శాంతిపురం పిహెచ్‌సిని సైతం ఇదే విధంగా సుందరీకరిస్తామన్నారు. పిహెచ్‌సిని సుందరీకరిస్తుండడం పట్ల రాళ్లబూదుగూరు ప్రజలు, నేతలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప ఎంపిడిఓ రవి నాయక్, పిడిఓ శివశంకరయ్య, నేతలు బసవరాజు, మురళి, మునివెంకటప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్ని...

సందర్శించిన వన్‌హెల్త్ ట్రస్ట్ సభ్యులు



**శాంతిపురం, జూలై 17 ప్రభాతవార్త:** బెంగళూరుకు చెందిన వన్‌హెల్త్ ట్రస్ట్ ప్రతినిధుల బృందం శుక్రవారం శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. ఈ కార్యక్రమం రైతుసాధికార సంస్థ, ఎపిసిఎన్‌ఎఫ్ అధ్వర్యంలో జరిగింది. శాంతిపురం మండలం తులసి నాయనపల్లిలో కుప్పం ఆర్‌వైఎస్‌ఎస్ సిబ్బంది, హెల్త్ అండ్ న్యూట్రీషన్ బృందం అధ్వర్యంలో సూర్యమండలం ఎస్‌హెచ్‌జిసభ్యులతో ఫుడ్‌బాస్కెట్‌పై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అలాగే రామకుప్పం మండలం పెద్దగానూరు గ్రామంలో బిఆర్‌సి కేంద్రం, ప్రకృతి వ్యవసాయ రైతులతో వారు నేరుగా మాట్లాడారు. పంటసాగు విధానాలు, నిర్వహణ, విత్తన గుళికల తయారీ, జీవామృతం, ఘనామృతం, గోఆధారిత వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం ఆదర్శంగా ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది, డిపిఎం అమృతవల్లి, నోడల్ అధికారి బాజీబాబు, దాదాపీర్, సుధారత్న, పవన్, ఎఫ్‌ఎంటిలు, సిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

## పశుమందలో చంద్రన్న పశు వైద్యశిబిరం



**గుడిపాల, జులై 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వసంతాపురం సబ్ సెంటర్ పశుమంద గ్రామంలో శుక్రవారం గుడిపాల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో 104 చంద్రన్న సంచార వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంకు హాజరైన ప్రజలకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ అనారోగ్య సమస్యలతో వైద్యం కోసం వచ్చిన వారితో పాటు దీర్ఘకాలిక వ్యాధులపై వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం పురస్కరించుకుని సీజనలు వ్యాధులు ప్రబలకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ బాలసూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## గుడివంక ఆలయం వద్ద తాగునీటి వసతి కల్పించాలి

– కడ పి.డి. వికాస్ మర్మత్



**గుడుపల్లె, జూలై 17 ప్రభాతవార్త :** మండలంలోని గుడివంక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద ఆడికృత్తికకు వచ్చే భక్తుల కోసం అధికారులు తాగునీటి వసతి కల్పించాలని కడ పి.డి.వికాస్ మర్మత్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. ఆలయ సమీపంలో పల్లపు ప్రాంతాన్ని ఇసుకతో నింపేలా చూడాలని స్థానిక నేతలు కోరారు. దీనిపై పి.డి. స్పందించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు ఏర్పాటుచేపడ్తామన్నారు. ప్రతి అంశాన్ని, సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించడం కడ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ షేక్ మహ్మద్ హుసేన్, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బు, కడ సభ్యుడు వెంకటేష్, హేమాంబర గౌడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## విజయంలో ఇన్వెస్టీచర్ వేడుకలు



**చిత్తూరురూరల్, జూలై 17 ప్రభాతవార్త:** చిత్తూరు విజయం సిబిఎస్ఈ పాఠశాలలో విద్యాసంస్థల అధినేత డా.యం, తేజోమూర్తి అధ్యక్షతన ఇన్వెస్టిట్యూర్ వేడుకలను నిర్వహించారు. ఓటింగ్ ద్వారా ఎంపికూన పాఠశాల క్యాబినెట్ సభ్యులు హెడ్‌బాయ్ ఎస్ చైతన్యకుమార్, హెడ్‌గర్ల్ ఎ.జసియా, స్పోర్ట్స్ కెప్టెన్ కె భవ్యశ్రీ, హౌస్‌కెప్టెన్లు తదితరులకు శాషెస్, రిబ్బన్లు ప్రధానం చేసి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. అకడమిక్ డైరెక్టరు డా.ఎం. శైలజమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఇలాంటి కార్యక్రమాల ద్వారా అలవాటుపడతాయన్నారు. అలాగే డా.ఎం. తేజోమూర్తి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో యువత చురుకుగా పాల్గొనాలనీ, ఇది వారి భవితకు తోడ్పడుతుందన్నారు. అనంతరం యాజ మాన్యం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ పి శ్రీవిద్య, ప్రమీల, శ్రీదేవి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నియామక పత్రాలు అందజేత



**చిత్తూరురూరల్, జూలై 17 ప్రభాతవార్త:** చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఇటీవల నియమితులైన అంగన్‌వాడీకేంద్రాల సహాయకులకు ఉద్యోగ నియామక పత్రాలను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అందజేసారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చిత్తూరు అర్బన్, గుడిపాల మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల సహాయకులకు నియామకపత్రాలను స్థానిక నాయకులతో కలసి అందజేసి, ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే



**చిత్తూరురూరల్, జూలై 17 ప్రభాతవార్త:** ప్రజల నుంచి అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించా రు. విద్యుత్ బస్సులను ఆర్టీసి యాజమాన్యమే నిర్వహించాలని ఏపిఎస్‌ఆర్టీసి జెఎసి నాయ కులు, సిమెంట్‌రోడ్డు, కాలువల నిర్మాణం, తదితర సమస్యలపై కాలనీ వాసులు వినతి పత్రం అందజేసారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్‌చౌ దంరి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, పరిశీలకులు పురిమిట్లకుమారి, వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు మొక్కజొన్న విత్తనాలు పంపిణీ



రామకుప్పం, జూలై 17 ప్రభాతవార్త: మండలంలోని గొరిమాకులపల్లి గ్రామ సచివాలయంలో రైతులకు మొక్కజొన్న విత్తనాలను పిఎసిఎస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, స్థానిక నేతలతో కలిసి పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం పరిపాలనలో సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు, గడ్డి చాప్ కట్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ తదితర అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, వెంకటప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



**రామకుప్పం, జూలై 17 ప్రభాతవార్త:** మండలంలోని కావలి మడుగు గ్రామంలో పెరుమాలప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం సమాచారం తెలుసుకున్న కూటమి నేతలు ఆయన భౌతిక టయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆయన అంత్యక్రియలకు పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, యూనిట్ ఇంచార్జ్ గంట్లప్ప గౌడు, చంద్రశేఖర్ రెడ్డి, గజేంద్ర, మునిరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సీఎం చంద్రబాబు భరోసా

రామకుప్పం, జూలై 17 ప్రభాతవార్త:



నిరుపేదలకు చంద్రబాబు నాయుడు సిఎంఆర్‌ఎఫ్ నిధుల ద్వారా ఆర్థిక భరోసాను అందిస్తున్నారని జిల్లా నేత నారాయణ చారి, యూనిట్ ఇంచార్జ్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బల్ల పంచాయితీలో వల్లెమ్మ, సుబ్బన్నలకు లక్ష ఎనిమిది వేల రూపాయలు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. సీఎం సొంత నియోజకవర్గంలో ప్రతి నిరుపేదలకు ఆర్థిక సాయం అందించి వారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సత్తి, రమేష్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 20న జిల్లా స్థాయి షైనింగ్ స్టార్ అవార్డులు ప్రదానం

చిత్తూరు, జులై 17 ప్రభాతవార్త: జిల్లా స్థాయిలో టెన్త్, ఇంటర్మీడియేట్ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం జులై 20వ తేదీన షైనింగ్ స్టార్ అవార్డులను ప్రదానం చేయనుంది. చిత్తూరు జడ్పీ సమావేశ భవనంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈ జిల్లా స్థాయి షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంకు టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన 168 మంది విద్యార్థులు, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులను జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డుల ప్రదానం కార్యక్రమంను సమర్థవంతంగా నిర్వహించి పూర్తి చేయడానికి శుక్రవారం సర్వశిక్షాభియాన్ ఎపిసి వెంకటరమణరెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైన ఒకొక్క విద్యార్థికి ప్రభుత్వం రూ.20 వేల నగదు, ప్రశంసాపత్రం, మెడల్‌ను అందజేయనున్నారు. ఈ నెల 20వ తేదీన జరిగే షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానోత్సవ రిజిస్ట్రేషన్ కమిటీ, కల్చరల్ కమిటీ, ఫుడ్ కమిటీని నియమించి కమిటీలోని సభ్యులు కార్యక్రమం పక్కాగా విజయవంతం అయ్యేలా ఏర్పాట్లు చేపట్టాలని సర్వశిక్షాభియాన్ ఎపిసి మద్దిపట్ల వెంకటరమణ అధికారులను ఆదేశించారు. షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రితో పాటు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

## కడ పి.డి.చే పరిశ్రమ ఏర్పాటు ప్రాంతం పరిశీలన



**శాంతిపురం, జూలై 17 ప్రభాతవార్త :** మండలంలోని 121 పెద్దూరు ప్రాంతంలో ఏర్పాటుచేయనున్న ఐటిసి మార్స్ పరిశ్రమకు సంబంధించి కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ భూమి పరిశీలన చేసి రైతులతో మాట్లా డారు. ఈసందర్భంగా పి.డి. మాట్లాడుతూ పరిశ్రమకు అనుస ంధాన ంగా రహదారి ఏర్పాటుపై చర్చించారు. పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, ఈ ప్రాంతం అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ ఎడి పల్లవి, కడ సభ్యురాలు సుగుణమ్మ, పిఎసిఎస్ ఛైర్మన్ గోపాల్, చంద్ర, లోకి, ఎఇ నాగేం ద్రకుమార్ పాల్గొన్నారు.

## క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించండి

సూళ్లూరుపేట, జూలై 17 ప్రభాతవార్త : ఎల్‌నీలో ప్రభావంతో ప్రస్తుతం నెలకొని ఉన్న వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ఉండాలంటే తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్‌ను చెల్లించాలని సూళ్లూరుపేట వ్యవసాయ అధికారి కాంచన శుక్రవారం తెలిపారు. ఖరీఫ్ సీజన్లో రైతులు వేసే వరి, సజ్జ, నిమ్మ పంటలకు ఇన్సూరెన్స్ కట్టుకోవాలని ఆమె సూచించారు. వరి వేసిన వారు ఆగస్టు 15వ తేదీలోగా, సజ్జ వేసిన వారు జూలై 31 తేదీలోగా ఇన్సూరెన్స్ ప్రీమియంను చెల్లించాలన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో తెలపడం జరుగుతుందని ఆమె చెప్పారు.

## చిన్నపాటి వర్షానికి చెరువుల మారిన రోడ్లు



సూళ్లూరుపేట, జూలై 17 ప్రభాతవార్త: చిన్నపాటి వర్షం కురిసిన సూళ్లూరుపేట పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా శుక్రవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి పట్టణంలోని సాయి నగర్‌లో రోడ్లు చెరువుల్లాగా మారాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్లపై నడవాలంటే నరకం చవిచూస్తున్నారు. అలాగే షార్ వై జంక్షన్ వద్ద శ్రీహరికోట వెళ్లే మార్గంలో రోడ్డుపై ఆక్రమణ జోరుతో వర్షపు నీరు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పట్టణంలోని ఆర్‌అండ్‌బి రోడ్డు ఇరువైపులా ఆక్రమణల జోరు ఎక్కువ కావడంతో ఇటీవలే వేసిన నూతన తారు రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. తారు రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ఈ రోడ్డు కూడా త్వరలోనే పాడైపోయి అవకాశాలు ఉన్నాయి. అధికారులు ప్రత్యామ్నయ చర్యలు చేపట్టి ప్రజలకు ఈ బాధల నుండి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే రామకృష్ణ లక్ష్యం



బాలాయపల్లి, జూలై 17 ప్రభాతవార్త: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ లక్ష్యంగా పెట్టుకున్నారని మండల టిడిపి అధ్యక్షులు రాయి సత్యం నాయుడు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు రావి సత్యం నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, టిడిపి నేతలు జడపల్లి కోటేశ్వర గౌడ్, సివికె నాయుడు, మారెళ్ల వెంకటాద్రి, ఆది వెంకట కృష్ణ రెడ్డిలు టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ముందుగా శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సతీమణి సింధు గోత్రనామాలపై శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కురుగొండ్ల చేసిన అభివృద్ధి సేవలను జడపల్లి కోటేశ్వర గౌడ్ కొనియాడారు. నియోజకవర్గాన్ని కురుగొండ్ల అభివృద్ధి చేస్తున్నారని ఆది వెంకటకృష్ణ రెడ్డి అన్నారు. మారెళ్ల వెంకటాద్రి మాట్లాడుతూ తెలుగుగంగ, కండలేరు, సోమశీల జలాలను రైతులను అందించి నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేసారని తెలిపారు. ఈ జన్మదిన వేడుకల్లో టిడిపి నేతలు సివికె నాయుడు, మారెళ్ల వెంకటాద్రి, రావి సత్యంనాయుడు, బాలకృష్ణరెడ్డి, యు.మోహన కృష్ణ, గోపికృష్ణ రెడ్డి, ఆది వెంకటకృష్ణ రెడ్డి, అక్కుర్తి వెంకటయ్య, మాధవయ్య నాయుడు, ఎన్.శ్రీనివాసులు నాయుడు, దాసరి కోటేశ్వరరావు, చిత్తూరు పద్మనాభం, రఘురాం రెడ్డి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఉపాధ్యాయులిని భర్తీ చేయండి:ఎంఈఓ

వాకాడు, జూలై 17 ప్రభాతవార్త: మండలంలోని ఉపాధ్యాయుల కొరత లేకుండా వెంటనే నియమించాలని, లేనియెడల అకడమిక్ ఇన్స్‌స్ట్రక్టర్లను నియమించాలని వాకాడు మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని అన్ని పంచాయతీలలో సెకండ్ గ్రేట్ టీచర్లు 58, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు ఇద్దరూ కొరత ఉందని ఎంఈఓ అన్నారు. పాఠశాలలో పిల్లలు శాతం సంఖ్య ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులు కొరతతో బోధన కొరతను అధికమించేందుకు ప్రభుత్వ ఉన్నత అధికారులు దృష్టి సారించి వెంటనే సిబ్బందిని నియమించాలని ఎంఈఓ కోరారు. టీచర్లు పని సర్దుబాటు చేపట్టిన కొన్నిచోట్ల సిబ్బంది కొరత సమస్య పరిష్కారం చేయలేకపోతున్నామని అందువల్ల ప్రత్యామ్నాయంగా ఇన్స్ట్రక్టర్లను నియమించాలని ఎంఈఓ కోరారు.

## ఖరీఫ్ సీజన్‌కు రైతులు పంట బీమా చేసుకోవాలి:ఏవో

వాకాడు, జూలై 17 ప్రభాతవార్త: రైతులు 2026-2027వ సంవత్సరంను గాను ఖరీఫ్ పంటలకు పీఎం ఎఫ్బి వై పథకం ద్వారా బీమా చేసుకోవాలని వాకాడు వ్యవసాయ శాఖ అధికారిని దీప తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులకు ప్రకటన ద్వారా తెలియజేస్తూ వేరుశనగ, నిమ్మ పంటలను గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటామని అన్నారు. సజ్జల పంటలకు జిల్లా యూనిటీగా పరిగణిస్తారని, వేరుశనగ పంటకు నిమ్మ పంటకు మండల బీమా యూనిటీగా పరిగణిస్తారని ఆమె తెలిపారు. అదేవిధంగా సజ్జ పంటలకు జనరల్ సెంట్రల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, వేరుశనగ, నిమ్మ పంటకు ఇఫ్కొ టోక జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ అమలు చేయు ఏజెన్సీలుగా ఉంటాయని అన్నారు. వరి పంటకు ఎకరాకు 42 వేల రూపాయలు రైతులు 168 రూపాయలు, సజ్జ పంటకు 16 వేల రూపాయలు గాను 64 రూపాయలు, వేరుశనగ పంటకు 28 వేల రూపాయలుగాను 547 రూపాయలు, నిమ్మ పంటకు 50 వేల రూపాయలు గాను 2530 రూపాయలు ఎకరాకు చెల్లించాలని తెలిపారు.

## ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కిషోర్



నాయుడుపేట, జూలై 17 ప్రభాతవార్త ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గూడూరు కిషోర్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు దుంప కుంట్ల శబరి వరప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పదవి సమాజ సేవ చేసేందుకు తనకు లభించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు తెలియజేశారు. మిత్రులు, సంఘ సభ్యులు, శ్రేయోభిలాషులు సహకారంతో ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ ప్రతిష్టను పెంపొందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

## గుడిమల్లం మాస్టర్‌ప్లాన్ అమలుపై ఎంఎల్‌ఏ సమీక్ష



శ్రీకాళహస్తిరూరల్,జూలై 17 ప్రభాతవార్త: అనంత్‌అంబాని గుడిమల్లం అభివృద్ధికి మంజూరు చేసిన రూ.28కోట్ల నిధులతో చేపట్టే మాస్టర్‌ప్లాన్ అమలుకు సంబంధించి శుక్రవారం ఊరందూరు గ్రామంలో ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు ఆలయ ఇఒ మునిశేఖర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై పలు అంశాలు ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి సుధీర్ఘంగా చర్చించారు. మాస్టర్ ప్లాన్ రూపొందించే సమయంలో పలు అంశాలను సమీక్షించారు. ఇది మహత్తర పథకం అని మనకు అనిల్ అంబాని వరంలా నిధులు మంజూరు చేసారన్నారు. ఈ నిధులతో ఆలయరూపు రేఖలు మార్చుటకు యుద్ద ప్రాతిపదికన పనులు చేయుటకు అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు పోవాలన్నారు. అధికారులు, చైర్మెన్ ఆలోచనలను ఎంఎల్‌ఏకు వివరించగా ఆయన పరిశీలించిన తరువాత పాపానాయుడుపేట నుంచి 40అడుగుల రోడ్డునుప్రతిపాదించగా ఎంఎల్‌ఏ దానిని 60అ డుగుల రోడ్డును ప్రతిపాదించాలన్నారు. కాగా రోడ్డు పక్కన ఫుట్ పాత్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాక రోడ్డు మధ్యలో చక్కటి లైటింగ్‌ను ఏర్పాటుకు ప్రతిపాదించాలన్నారు. అలాగే ఒరెండు సర్కిల్స్ ఏర్పాటు చేయాలని అందులో దేవుళ్ళ బొమ్మలను ఏర్పాటుకు ప్రతిపాదించాలని సూచించారు.

**ఊరుముందు వంతెనపై చర్చ:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడుమండలంలోని గుడిమల్లం ఆలయానికి చేరుకోవాలంటే ముందు సీతకాలువ అడ్డంకిగా ఉందన్నారు. వర్షాకాలం ఆలయానికి చేరుకోవాలంటే ఇబ్బందిగా మారిందన్నారు. అయితే ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ.15కోట్లుతో అంచనా ప్రతిపాదన రూపొందించామన్నారు.

## శాశ్వత క్షత్రియ వివాహ వేదిక సిద్ధం

**-ముఖ్య సలహాదారుగా రామరాజు**






పుత్తూరు, జూలై 17 ప్రభాతవార్త : క్షత్రియ వివాహ సంబంధాలను సమకూర్చేందుకు శాశ్వత క్షత్రియ వివాహ వేదిక ఏర్పాటు చేయనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీధర్‌రాజు, డాక్టర్ రవిరాజు తెలిపారు. వేదికకు ముఖ్య సలహా దారుగా తిరుపతికి చెందిన రామరాజును నియ మించినట్టు తెలిపారు. పట్టణంలోని సుభాషిణి ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్షత్రియ సంస్కృతి, సంప్రదాయాల మేరకు అవివాహిత యువతకు వివాహ సంబంధాలు సమకూర్చేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక ప్రతి నెల రెండో ఆదివారం క్షత్రియులకు సంబంధించిన నాలుగు గోత్రాలకు నియమించిన పెద్దలతో వివాహ సంబంధాలు చర్చిస్తామన్నారు. ఉమ్మడి చిత్తూరు, ఉమ్మడి అనంతపురం జిల్లాల కోసం ఒక శాశ్వత క్షత్రియ వివాహ వేదికను పుత్తూరు పట్టణంలో ఆగస్టు నెలాఖరున ప్రారంభిస్తామని వెల్లడించారు. ఎంపిక చేసిన మిగిలిన 8 ప్రాంతాల్లో హైదరాబాద్, రాజంపేట, విజయవాడ, రాజమండ్రి, భీమవరం, విజయనగరం, తిరువళ్లూరు, బెంగళూరుల్లో కూడా అన్ని లాంఛనాలు పూర్తి చేసుకుని అన్ని కార్యాలయాలు ఒకేసారి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అనంతరం పుత్తూరులో సుభాషిణి ఆస్పత్రిలోని సెల్లార్‌లో ఒక గదిని శాశ్వత క్షత్రియ వివాహ వేదిక కార్యాలయంగా వితరణ చేసినందుకు ప్రముఖ వైద్యులు డాక్టర్ జంపన శ్రీధర్‌రాజు, డాక్టర్ సుభాషిణి దంపతులను సమావేశానికి హాజరైన క్షత్రియ కుటుంబాలన్నీ సభాముఖంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానం చేశారు. వివాహ వయస్సు, లేటు వయస్సులో వివాహమైన వారి సంతానం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిష్కారాలను ఒక పుస్తకం రూపంలో క్షత్రియ కుటుంబాలకు అందిస్తే బాగుంటుందని సభలో పలువురు కోరారు. ఆ మేరకు విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు పాతపాటి రవిరాజు స్పందిస్తూ తెలుగు రాష్ట్రాల్లో వున్న క్షత్రియ వైద్యులంతా ఒక బృందంగా ఏర్పడి పుస్తకాలు రూపొందించడానికి కృషి చేద్దామని తెలిపారు. చెన్నై రాజక్కల్ సంఘం నుంచి భాస్కరరాజు బృందం, బెంగళూరు క్షత్రియ రాజుల సంఘం నుంచి రవిరాజు బృందం హాజరై తమ విలువైన అభిప్రాయాలను తెలియజేశారు. సమావేశంలో క్షత్రియ పెద్దలు రామరాజు, యువరాజు, వి.ఎన్.రాజు, వాసుదేవరాజు, రెడ్డియ్యరాజు, సుకుమార్‌రాజు, నరసింహులురాజు, సిద్దిరాజు, రామకృష్ణమరాజు, మధుసూదనరాజు, రుక్మాంగదరాజు, మనోహర్‌రాజు, దీనదయాల్ రాజులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయం సమగ్రాభివృద్ధి సమీక్షా



శ్రీకాళహస్తి, జూలై 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయాభివృద్ధికి చక్కటి ప్రణాళికలు రూపొందించాలని అందుకు తుడా సహాకరిస్తుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ సమావేశం మందిరంలో తుడా చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి, చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ దేవస్థానం అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వ రాలయ అభివృద్ధికి నిధుల కొరత లేదన్నారు. అంతేకాక అనంత్ అంబానికి కూడా రూ.23కోట్లు ఇవ్వటానికి ముందుకు వచ్చారన్నారు. ప్రపంచ ప్రసిద్ది చెందుతున్న పుణ్యక్షేత్రంలో అంతర్జాతీయ స్థాయి అభివృద్ధికి చక్కటి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తిరుమల తరహాలో భక్తులకు సదుపాయం కల్పించేందుకు అదే తరహా కాటేజీలను ఏర్పాటు చేయాలన్నారు. శ్రీకాళహస్తికి వస్తున్న భక్తులకు దేవస్థానం కన్నా ప్రైవేటు వసతులే అధికంగా ఉన్నాయన్నారు. దేవస్థానం కనీసం 30ఎకరాల్లో కాటేజీల సముదాయాన్ని రూపొందించాలని కోరారు. తిరుమల తరహాలో సిల్వర్, గోల్డ్, డైమండ్ కేటగిరిల్లో గదుల నిర్మాణాన్ని చేపట్టుటకు అంచనా ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. భక్తులకు ఆలయంలో కనెక్టివిటి కల్పించేందుకు మాస్టర్ ప్లాన్ రోడ్లను రూపొందించాలన్నారు. ఆలయం చుట్టూ మాత్రమే కాకుండా 40-60 అడుగుల రోడ్లను నిర్మించుటకు అంచనాలు తయారు చేయాలన్నారు. ఇకస్వర్ణముఖి పరిరక్షణకు ఊర్లోని మురికి నీరు నదిలో చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం భక్తులకు చక్కటి వెజిటేరియన్ భోజన సదుపాయాన్ని కల్పించాలని కోరారు. మాస్టర్ ప్లాన్‌రోడ్ల నిర్మాణానికి సంబంధించి దేవస్తానం, రెవెన్యూ, తుడా అధికారులతో క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేసి తుడ-చెన్నై కనెక్టివిటిని వేగవంతం చేయాలని ఎంఎల్‌ఏ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి తుడా చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, తుడా కార్యదర్శి ఎన్‌వి శ్రీకాంత్‌బాబు, సిపిఓ దేవి కుమారి, భూసేకరణ అధికారి సుజనతో పాటు ఆలయ ఇఓ బికె వెంకటేశులు, ఇఇ శ్రీనివాసులు రాజు, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణంరెడ్డితదితరులు పాల్గొన్నారు.

### కరుమారియమ్మ దేవాలయంలో

## ఆడి నెల మహోత్సవం ప్రారంభం



తిరుపతి, జూలై 17ప్రభాతవార్త: తిరుపతి తిలక్ రోడ్డులోని కరుమారియమ్మ దేవాలయంలో ఆడి నెల మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధల నడుమ ప్రారంభమయ్యాయి. అమ్మవారి అనుగ్రహం కోసం వందలాది మంది భక్తులు విశేష భక్తితో పాల్గొని పూజలు నిర్వహించారు. మహోత్సవాల తొలి రోజు స్థానిక మంచినీళ్లగుంట శివాలయం వద్ద కరుమారియమ్మను సుందరంగా అలంకరిం చారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కరుమారియమ్మ తల్లి ఊరేగింపులో వందలాది మంది మహిళలు పాలకుండలను తలపై పెట్టుకుని , నగర వీధుల మీదుగా భక్తి పారవశ్యంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగాయి. భక్తులు సమర్పించిన పవిత్ర పాలతో అమ్మవారి మూల మూర్తికి మహాభిషేకం వైభవంగా నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమె కృపాకటాక్షాలు పొందారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వందలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ప్రధాన అర్చకుడు వేలాయుధం, బిజెపి నాయకులు గుండెల గోపీనాథ్ రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బాలాజీ, మునిరాజా, వెంకట ముని, దేనా, గుణశేఖర్, మాధవ, వెంకటేశ్వర్లు, ఆనంద్, సుబ్రహ్మణ్యం, బాబు, రేవతి, ఉషారాణి, అల్లిరాణి, గాలం కాంచనమ్మ, కుమారి, గీతమ్మ, ప్రియాంక, ద్రాక్షాయని, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

## ద్రౌపదీ అమ్మవారికి సారె అందించిన నాయకులు



శ్రీకాళహస్తి, జూలై 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఉత్సవాలు శుక్రవారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి ఆలయంలో పూజల సందడి చోటు చేసుకుంది. ఉదయం ఆలయంలోని ఈశాన్య మూల వెలసిన యాగశాలలో హోమాలు ప్రారంభించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. మూడు రోజులు పాటు ఆలయ చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు పర్యవవేక్షించారు. కాగా సాయంత్రం నుంచి ఆలయ ఆవరణ భక్తులు, నాయకుల సందడి చోటుచేసుకుంది. సాయంత్రం ధ్వజారోహణకు ముందు యువ నాయకులు స్వామి అమ్మవార్లకు భక్తి శ్రద్దలతో సారె అందించారు. ఈ నేపథ్యంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కోలా ఆనంద్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, ఆలయ ఇఒ బికె వెంకటేశులు సారెను భక్తి శ్రద్దలతో అందించారు. సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు. యువకులు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. ఎంఎల్‌ఏతో పాటు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు పట్టణ పార్టీ కార్యదర్శి కాసరం రమేష్, పేట బాలాజి, సుబ్బయ్య, మిన్నల్‌రవి, బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాధ్ తెలుగుదేశం పార్టీకి చెందిన నెమళ్లూరు బుజ్జి. అమర్‌నాధ్. చాగణం శైలజ, బి.రేణుకాదేవి, గరికపాటి రమేష్ తదితరులున్నారు. సారెను సంప్రదాయబద్దంగా ఆలయ పూజారి పురుషోత్తంకు అందించారు. పూజలను శాస్త్రోక్తంగా ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ ఎస్‌ఎంకె స్వామినాధన్ గురుకుల్, ఎస్‌ఎంకె పరశురామ్ గురుకుల్, ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామిలు నిర్వహించారు. ఏర్పాట్లును డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ధ్వజారోహణం తరువాత గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

## ప్రజాదర్బార్‌లో వినిపించిన మరో ఆవేదన

**- రైతులకు సేవలందిస్తున్నాం - కానీ సిబ్బంది ఎక్కడ**



వరదయ్యపాలెం, జూలై 17 ప్రభాతవార్త : సాధారణంగా ప్రజా దర్బార్‌కు ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారు. అయితే శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో రైతుల సమస్యలు సందర్భంగా ప్రభుత్వ అధికారి తన శాఖ ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం ప్రత్యేకత సంతరించుకుంది. వరదయ్యపాలెం మండల వ్యవసాయ అధికారి గౌరి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కలిసి మండలంలో వ్యవసాయ శాఖ ఎదుర్కొంటున్న సిబ్బంది కొరతపై ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో సుమారు 10 వేలమంది రైతులు, 19 వేలు ఎకరాలు సాగుకు 12 రైతు సేవా కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం కేవలం నలుగురు రైతు సేవా కేంద్ర సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విత్తనాలు, యూరియా వగైరా పంపిణీ చేయాలన్నా, ఈ క్రాప్ పంట నమోదు చేయాలన్నా, ధాన్యం కొనుగోలు కూడా ఈ నలుగురే చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రతి రైతుకు సకాలంలో సేవలు అందించడం తీవ్ర ఇబ్బందిగా మారిందని చెప్పారు. మా శక్తివంచన లేకుండా రైతులకు సేవలందిస్తున్నాం. అయితే సరిపడా సిబ్బంది లేకపోవడంతో తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తున్నాం. మా పరిస్థితిని కూడా ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేసి తగిన సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలి అంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. వ్యవసాయ అధికారిణి ఆవేదనను ఓర్పుగా విన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మండలానికి అవసరమైన సిబ్బంది నియామకానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో పనిచేసే వ్యవసాయ అధికారులపై పెరుగుతున్న పనిభారం ఆందోళన కలిగిస్తోంది. రైతులకు మెరుగైన సేవలు అందాలంటే ఖాళీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయడం, రైతు సేవా కేంద్రాలను పూర్తిస్థాయిలో సిబ్బందితో బలోపేతం చేయడం అత్యవసరమని రైతులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. ఎంఏఓ గౌరి తన సమస్యను వివరిస్తున్న సమయంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీఓ విజయమ్మ, పిఏసిఎస్ చైర్మన్ నందకిశోర్ రెడ్డి, డివిఎంసి మెంబెర్ గుత్తి త్యాగరాజు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, అర్జీదారులు ఉన్నారు. అనంతరం పలు సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలకు డ్రైనేజ్ ప్రాబ్లంకు, గోవర్ధనపురం జడ్పీ హైస్కూల్‌కు కాంపౌండ్ వాల్, పై సమస్యలకు ఎమ్మెల్యేకి అర్జులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ, మండల అధ్యక్షులు, దిలీప్ రాయల్, భారతీయ జనతా పార్టీ నాయకులు, సిద్దులయ్య, భాస్కర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు, రావూరి కరుణాకర్ నాయుడు, పవన్ కుమార్, దాసయ్య, సుధాకర్ నాయుడు, ఇల్లంగో రెడ్డి, ఎక్స్ ఎంపీపీ, భారతి, మునుబుష్ణమ్మ, పృధ్వి చౌదరి, జనసేన నాయకులు, తడ శ్రీనివాసులు, విజయ్ కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంజి మాధవయ్య జన్మదిన వేడుక



పుత్తూరు, జూలై 17 ప్రభాతవార్త : రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ గంజి మాధవయ్య జన్మదిన వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం ఆయన స్వగృహంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం స్థానిక అన్నా క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గతంలో పుత్తూరు ఎంపిపిగా మాధవయ్య నిజాయితీగా పనిచేసి టిడిపికి ఎనలేని సేవలందించారని ప్రశంసించారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పార్టీ శ్రేణులు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తడుకు సింగిల్ విండో ఛైర్మన్ సిహెచ్.కరుణయాదవ్, రూరల్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరవ బాలాజీ, హేమంత్‌కుమార్ తదితర పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైనింగ్ అవార్డులకు విద్యార్థులు ఎంపిక



పలమనేరు రూరల్, జూలై 17 ప్రభాతవార్త :పలమనేరు మండల విద్యార్థునులు ఎన్ జెస్సికా, ఏ జి శ్రీలేఖ, ఎస్ రామ్ చరణ్ రెడ్డి సైనింగ్ అవార్డులకు ఎంపికైనట్లు పలమనేరు ఏలీనా బేటి హైస్కూలు కరస్పాండెంట్ సిస్టర్ మేరీ తుమ్లన్ శుక్రవారం తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచినా పలమనేరు మండలము ఏలీనాభేటీని విద్యార్థునుల కుషైనింగ్ అవార్డు రావడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. కరస్పాండెంట్ సిస్టర్ మేరీ తుమ్నాన్ సైనింగ్ అవార్డులకు తమ పాఠశాల యందు విద్యార్థులు ఎంపిక కావడం ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఫస్ట్ సెకండ్ విభాగంలో మొదటి రెండవ తృతీయ విభాగం నుంచి ముగ్గురు విద్యార్థులు తమ పాఠశాల నుంచే ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలో షైనింగ్ అవార్డుల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఎంపికైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, ప్రశంస పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

## పుత్తూరు అర్బన్ సిఐగా నెట్టి కంఠయ్య



పుత్తూరు, జూలై 17 ప్రభాతవార్త : పుత్తూరు అర్బన్ సిఐగా నెట్టి కంఠయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నగరి ఎస్ఐగా పనిచేశారు. అనంతరం చిత్తూరు టూ టౌన్ సిఐగా రెండేళ్ల నుంచి పనిచేస్తూ పుత్తూరుకు బదిలీ అయ్యారు. శాంతి, భద్రతల పరిరక్షణతో పాటు పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా తెలిపారు.

## శ్రీ దక్షిణ కాళీ వారాహి అమ్మన్ శక్తిపీఠంలో...

## నవరాత్రి ఉత్సవాలు



పుత్తూరు రూరల్, జూలై 17 ప్రభాతవార్త: పుత్తూరు మండల పరిధిలోని కన్నంమిట్ట గ్రామంలో వెలసిన శ్రీ దక్షిణ కాళీ వారాహి అమ్మన్ శక్తిపీఠంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నవరాత్రి ఉత్సవాలు 9 రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఆలయాన్నివిద్యుత్ దీపాలంకరణ వేపాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందించారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్ళు



చంద్రగిరి, జూలై 17 ప్రభాతవార్త: సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారికి నరశింగాపురం హరిజనవాడ గ్రామస్థులు శుక్రవారం పొంగళ్ళు పెట్టుకున్నారు. మాజీ ఎంఎల్‌ఏ రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి చొరవతో హరిజనవాడ నుండి 100 కుటుంబాలకు చెందిన మహిళలు పొంగళ్ళ బుట్టలను మోసుకుని ఊరేగింపుగా బయలుదేరారు. భాణాసంఛా పేళుళ్ళు, డప్పు వాయిధ్యాల నడుమ కాలినడకన చంద్రగిరిలోని శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు ఆలయంలో పొంగళ్ళను వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ అర్చకులు సూరి స్వామి అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామపెద్దలు మురళి, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం, మనోహర్, సురేంద్ర, శంకర్, వెంకటేష్, తదితరులు పర్యవేక్షించారు.

